సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం । 4 । మార్చి । 2025



జేకే-5ఓసీ మూసివేత?

సింగరేణి ఇల్లెందు ఏరియాలోని జేకే-5 ఓసీ మూసివేత దశకు చేరింది. ఓపెన్‌కాస్టు గనిలో బొగ్గు నిక్షేపాలు అడుగంటాయి.

8లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (మంగళవారం సా॥) 6.22

సహర్ (బుధవారం ఉ॥) 5.08

వాతావరణం

గరిష్ఠం / కనిష్ఠం 38° / 20°

జిల్లాలో మంగళవారం పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదయ్యే అవకాశం ఉంది. ఉదయం, రాత్రి వేళల్లో కొంత చలి ఉంటుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు ముత్తంగి అలంకరణ



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులు సోమవారం ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చి కనువిందు చేశారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

హైకోర్టు ఏజీపీగా భద్రాచలం వాసి



ఉత్తర్వులు అందుకుంటున్న సాల్మన్‌రాజ్

భద్రాచలం: రాష్ట్ర హైకోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా భద్రాచలానికి చెందిన సాల్మన్ రాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు హైకోర్టు అడిషనల్ అడ్వకేట్ జనరల్ రజనీకాంత్ రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. భద్రాచలం బార్ అసోసియేషన్‌లో సీనియర్ న్యాయవాదిగా సాల్మన్ రాజ్ పనిచేశారు. భద్రాచలం మొబైల్ కోర్టులో ఆరేళ్ల పాటు ఏజీపీగా పని చేసిన అనుభవం ఉంది. కాగా సాల్మన్‌రాజ్‌ను బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోట దేవదానం తదితరులు అభినందించారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఆర్‌జేడీ సత్యనారాయణ

ఖమ్మం సహకారనగర్: 2024–డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులు శిక్షణను సద్వినియోగం చేసుకుని బోధన మెరుగుపర్చుకోవాలని పాఠశాల విద్యాశాఖ వరంగల్ ఆర్‌జేడీ సత్యనారాయణ సూచించారు. ఖమ్మం ఎన్నెస్పీ కాలనీ పాఠశాలలో ఎస్‌జీటీలకు ఇస్తున్న శిక్షణను సోమవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రతీ సబ్జెక్టులో కనీస అభ్యసన సామర్థ్యాలు పెరిగేలా బోధన జరగాలని, తద్వారా ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు నమ్మకం పెరుగుతుందని చెప్పారు. తొలుత ఎన్నెస్పీ కాలనీలో ఎఫ్‌ఎల్‌ఎన్ తీరు, డైట్ కళాశాలలో అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. విద్యాశాఖ ఏఎంఓ రవికుమార్, డీఈఓ సోమశేఖరశర్మ, ఖమ్మం అర్బన్ ఎంఈఓ శైలజాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నైనీ.. మళ్లీ నిరాశే



పదేళ్లుగా సాగుతున్న నైనీ బ్లాక్ వ్యవహారం

- రెండోదశ పర్యావరణ అనుమతుల్లో జాప్యం
- ఉత్పత్తి చేస్తామంటూ మూడేళ్లుగా చెబుతున్న సింగరేణి
- ఈ ఆర్థిక సంవత్సరంలోనూ కనిపించని పురోగతి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: తక్కువ ఖర్చుతో ఎక్కువ బొగ్గు తవ్వి తీసేందుకు అవకాశం ఉన్న నైనీ బ్లాక్ నుంచి బొగ్గు ఉత్పత్తి చేయడంలో ఒక అడుగు ముందుకు.. రెండు అడుగులు వెనక్కు.. అన్నట్టుగా ఉంది సింగరేణి పరిస్థితి. బ్లాక్ దక్కించుకుని పదేళ్లు దాటినా ఇప్పటికీ అక్కడ బొగ్గు ఉత్పత్తి ప్రారంభమే కాలేదు.

తెలంగాణేతర ప్రాంతంలో..

తెలంగాణ బయట తొలిసారిగా బొగ్గు తవ్వకాలకు సింగరేణి సిద్ధమైంది. ఈ క్రమంలో ఒడిశాలోని అంగుల్ జిల్లాలో ఉన్న నైనీ కోల్‌బ్లాక్‌ను పిట్ హెడ్ మైన్‌గా 2015లో సింగరేణికి కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. అయితే పదేళ్లు గడిచినా ఇక్కడ బొగ్గు తవ్వకాలు ఇప్పటికీ మొదలు కాలేదు. నైనీ బ్లాక్‌కు సంబంధించి క్షేత్రస్థాయిలో పరిశీలించి సమగ్ర నివేదిక రూపొందించడానికే సింగరేణికి నాలుగేళ్ల సమయం పట్టింది. ఆ తర్వాత పర్యావరణ అనుమతుల కోసం ప్రయత్నించేలోగా కరోనా విపత్తు వచ్చి పడింది. ఎట్టకేలకు 2021 అక్టోబర్‌లో తొలిదశ పర్యావరణ అనుమతులు వచ్చాయి. ఇక కీలకమైన రెండో దశ పర్యావరణ అనుమతులు రావడమే తరువాయి అనే పరిస్థితి అప్పట్లో కనిపించింది.

అటవీ శాఖ క్లియరెన్స్..

నైనీ బ్లాక్ కోసం మొత్తంగా 912 హెక్టార్ల స్థలం సేకరించాల్సి ఉండగా ఇందులో అటవీ శాఖ పరిధిలోనే 783 హెక్టార్లు ఉంది. ఇందులో రిజర్వ్ ఫారెస్టుకు సంబంధించిన స్థలం 643 హెక్టార్లు ఉంది. పైగా ఈ స్థలంలో ఎలిఫెంట్ కారిడార్ కూడా ఉండడంతో రెండో దశ అనుమతుల సాధన సంక్లిష్టంగా మారింది. దీనికి తోడు గత ప్రభుత్వం సరైన స్థాయిలో శ్రద్ధ చూపించలేదనే విమర్శలు వచ్చాయి. దానికి తగ్గట్టే మూడున్నరేళ్లు దాటినా ఇప్పటికీ రెండో దశ అనుమతులు మంజూరు కాలేదు.

ఏడాది దాటినా..

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నైనీ బ్లాక్‌పై దృష్టి సారించారు. సింగరేణి ఉన్నతాధికారులు, సీఎండీ బలరాంనాయక్‌తో పాటు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సైతం రంగంలోకి దిగారు. నేరుగా ఒడిశా సీఎం, సీఎస్‌లతో చర్చలు జరిపారు. బొగ్గు తవ్వకాలతో అడవిలో నష్టపోయే చెట్లను గుర్తించడంతో పాటు అందుకు తగిన నష్టపరిహారం అంచనా వేసేందుకు చర్యలు ముమ్మరం చేస్తామని గతేడాది ఆగస్టులో ఒడిశా సర్కారు హామీ ఇచ్చింది. కానీ ఈ ఆర్థిక సంవత్సరం ముగింపు దశకు వచ్చినా ఇప్పటికీ ఆ పని పూర్తి కాలేదు.

నివేదికలకే పరిమితం..

రెండో దశ పర్యావరణ అనుమతులు వస్తేనే బొగ్గు ఉత్పత్తి ప్రారంభించడం సాధ్యం అవుతుంది. 2021లో మొదటి దశ అనుమతులు రావడంతో 2022 – 23 ఆర్థిక సంవత్సరం నుంచే సాలీనా పది మిలియన్ టన్నుల బొగ్గును నైనీ బ్లాక్ నుంచి ఉత్పత్తి చేస్తామని సింగరేణి సంస్థ తన నివేదికల్లో పేర్కొంటోంది. కానీ మూడు ఆర్థిక సంవత్సరాలు గడిచినప్పటికీ రెండో దశ పర్యావరణ అనుమతులే రాలేదు. దీంతో ఇక్కడి నుంచి ఒక్క బొగ్గు పెళ్లను కూడా తవ్వి తీయలేకపోయింది. ఇక్కడ బొగ్గు తవ్వకాలు మొదలైతే ఆ తర్వాత దశలో థర్మల్ పవర్ ప్లాంట్‌ను కూడా సింగరేణి ప్రారంభించాల్సి ఉంటుంది. కానీ ఈ పనులన్నీ జరిగేందుకు ఇంకా ఎంత సమయం పడుతుందో అనేదే ఇప్పుడు ప్రశ్నగా మారింది. నైనీతో పాటు గడిచిన మూడేళ్లుగా గోలేటి, రొంపేడు, వీకే మెగా ఓపెన్ కాస్ట్‌ల ద్వారా బొగ్గు ఉత్పత్తి ప్రారంభిస్తామని సింగరేణి చెబుతూ వస్తోంది. కానీ ఈ గనుల పరిస్థితి కూడా నైనీ తరహాలోనే ఉంది.

సాగర్ ఆయకట్టుకు 'సీతారామ' నీరు



వీకే రామవరం వద్ద కాల్వలో నీటి పరవళ్లను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే జారే తదితరులు

- ఈ ప్రాజెక్ట్‌తో రెండు జిల్లాలు సస్యశ్యామలం
- నాలుగేళ్లలో సీతారామ ప్రాజెక్ట్ పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యం
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

అశ్వాపురం : నాగార్జున సాగర్ ఆయకట్టు భూములు ఎండిపోకుండా గోదావరిలో ఉన్న కొద్దిపాటి జలాలను సీతారామ ప్రాజెక్ట్ ద్వారా సాగునీటిని అందిస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని కుమ్మరిగూడెంలో గోదావరి నదిపై ఉన్న దుమ్ముగూడెం ఆనకట్టను, నీటి మట్టాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. బీజీ కొత్తూరులో సీతారామ ప్రాజెక్ట్ ఫేస్ -1 పంప్‌హౌస్‌ను సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. గోదావరిలో ఉన్న కొద్దిపాటి జలాలను సాగర్ ఆయకట్టు పరిరక్షణకు కేటాయిస్తున్నామని చెప్పారు. అశ్వాపురం మండలం బీజీకొత్తూరు, ములకలపల్లి మండలం పూసుగూడెం, కమలాపురంలోని మూడు పంప్‌హౌస్‌ల ద్వారా 100 కిలోమీటర్ల మేర గోదావరి జలాలు ప్రవహించి రాజీవ్ కెనాల్ నుంచి నాగార్జునసాగర్ కెనాల్‌కు మంగళవారం నాటికి మళ్లిస్తామని వివరించారు. తద్వారా సాగర్ చివరి ఆయకట్టు ఎంబీసీ మధిర బ్రాంచ్ కెనాల్, తల్లాడ, పెనుబల్లి, వేంసూరు మండలాల చివరి ఆయకట్టుకు సాగర్ జలాలు పూర్తి స్థాయిలో అందుతాయన్నారు. అశ్వాపురం మండలంలో మారెళ్లపాడు ఎత్తిపోతల ద్వారా తుమ్మలచెరువుతో పాటు పినపాక నియోజకవర్గానికి వచ్చే పంట కాలానికి సాగునీరు అందిస్తామన్నారు. ములకలపల్లి, చంద్రుగొండ మండలాల్లో కాల్వలు నిర్మించి ఆ ప్రాంతానికీ నీరందిస్తామని తెలిపారు. వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న వైరా ప్రాజెక్ట్, లంకాసాగర్ ప్రాజెక్ట్ కింద ఉన్న ఆయకట్టు మధ్యలో ఉన్న సాగర్ ఆయకట్టును స్థిరీకరించి సుమారు 1.36 లక్షల ఎకరాలకు సీతారామ నీరందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గండుగులపల్లిలో నాలుగో పంప్‌హౌస్‌ను పూర్తి చేస్తే దమ్మపేట, అశ్వారావుపేట మండలాల్లో లక్ష ఎకరాలకు సాగునీరు అందించవచ్చన్నారు. సీతారామ ప్రాజెక్ట్ ద్వారా ఖమ్మం, భద్రాద్రి జిల్లాలను సస్యశ్యామలం చేస్తామన్నారు.

నేటి సాయంత్రానికి గోదావరి జలాలు..

ములకలపల్లి : నేటి (మంగళవారం) సాయంత్రానికి గోదావరి జలాలు ఎన్నెస్పీ కాల్వలోకి మళ్లించనున్నట్లు మంత్రి తుమ్మల తెలిపారు. మండలంలోని వీకే. రామవరం, కమలాపురంలోని పంప్‌హౌస్‌లను సోమవారం పరిశీలించి మాట్లాడారు. అనంతరం మాట్లాడుతూ.. సీతారామ ఎత్తిపోతల పథకం (ఎస్ఆర్ఎల్ఐపీ)లో 100 కిలో మీటర్ల మెయిన్ కెనాల్, మూడు పంప్‌హౌస్‌ల నిర్మాణం పూర్తి చేసి, లక్ష ఎకరాలకు సాగునీరు అందించేందుకు సర్వం సిద్ధం చేసినట్లు తెలిపారు. అశ్వాపురం మండలంలోని బీజీ కొత్తూరు పంప్‌హౌస్ -1 నుంచి నాలుగు రోజులుగా గోదావరి జలాలు ఎత్తిపోస్తున్నందున వీకే. రామవరం పంప్‌హౌస్-2కు సరిపడా నీళ్లు వచ్చాయని వివరించారు. డిస్ట్రిబ్యూటరీ కెనాళ్ల నిర్మాణాలకు భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు సూచించారు. సీతారామ కాల్వలకు అండర్ టన్నెల్స్ (యూటీ) ఏర్పాటు చేసి సమీప వాగుల్లోకి నీరు వదిలేలా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ ఎస్ఈ శ్రీనివాసరెడ్డిని ఆదేశించారు. ఆయా కార్యక్రమాల్లో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, నీటి పారుదల ఎస్ఈ రవికుమార్, ఈఈ వెంకటేశ్వరరావు, డీఈ శ్రీనివాస్, ఏఈ రమేష్, ఖమ్మం డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, నెల్లిపాక పీఏసీఎస్ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణపై కేంద్రానిది సవతి తల్లి ప్రేమ

విభజన చట్టంలోని నీటి పంపకాలు, తెలంగాణలోని సాగునీటి ప్రాజెక్టులకు నిధులు, అనుమతుల విషయంలో కేంద్ర ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపుతోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. 36 సార్లు కేంద్ర ప్రభుత్వాన్ని అభ్యర్థించినా నీటి పంపకాలు, నిధుల విడుదలలో నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందని విమర్శించారు. దీంతో దిగువ రాష్ట్రాలు ఎక్కువ నీరు వాడుకుంటున్నాయని, తెలంగాణకు నీరు రాక గోదావరిలో ఉన్న కొద్దిపాటి జలాలను నాగార్జున్‌సాగర్ ఆయకట్టుకు తరలించాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. విభజన చట్టంలో తాత్కాలిక పంపకాలైన 811 టీఎంసీల నీటిలో 511 టీఎంసీలు ఆంధ్రా ప్రాంతానికి కేటాయించారని, మిగిలిన 300 టీఎంసీలు కూడా తెలంగాణకు ఇప్పించడంలో కేంద్రం నిరాసక్తత చూపిస్తోందని విమర్శించారు. కృష్ణా జలాల్లో ట్రిబ్యునల్ ద్వారా రాష్ట్రానికి రావాల్సిన వాటాను త్వరగా పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. దేశంలోని అన్ని రాష్ట్రాలకు సమన్యాయం చేయాలన్నారు. దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం చిన్నచూపు చూస్తోందని, దేశ ఆదాయంలో తెలంగాణ చెల్లించే సొమ్మే ఎక్కువనే విషయాన్ని గుర్తుంచుకోవాలని అన్నారు.

కమలాపురంలో ఎత్తిపోశాయి !

ములకలపల్లి : మండల పరిధిలోని కమలాపురం సీతారామ పంప్‌హౌస్- 3 నుంచి గోదావరి జలాలు దిగువకు తరలాయి. ఇక్కడి మోటార్ ద్వారా నీళ్లు ఎత్తిపోయగా, గ్రావిటీ ద్వారా ఏన్కూర్ లింక్ కెనాల్‌కు తరలివెళ్లాయి. సోమవారం రాత్రి 8 గంటల సమయంలో నీటి పారుదల శాఖ అధికారుల పర్యవేక్షణలో ఈ ప్రక్రియ కొనసాగింది. మంగళవారం సాయంత్రంలోగా గోదారి నీళ్లను సాగర్ కాల్వలో కలుపుతామని మంత్రి తుమ్మల ప్రకటించిన నేపథ్యంలో అధికారులు యుద్ధప్రాతిపదికన నీటి తరలింపుపై ప్రత్యేక శ్రద్ధ చూపినట్లు తెలుస్తోంది. గత ఆగస్టు 15న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇక్కడ మోటార్లను ప్రారంభించగా, ఆరు నెలల్లోనే నీళ్లు ఎత్తిపోయడం విశేషం.

14 మంది మావోయిస్టుల లొంగుబాటు



లొంగిపోయిన వారి వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజ్

వివరాలు వెల్లడించిన ఎస్పీ రోహిత్‌రాజ్

కొత్తగూడెంఅర్బన్ : మావోయిస్టు పార్టీకి చెందిన 14 మంది సభ్యులు లొంగిపోయారని ఎస్పీ రోహిత్‌రాజ్ తెలిపారు. హేమచంద్రాపురం పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఆపరేషన్ చేయూత కార్యక్రమంలో భాగంగా లొంగిపోయిన మావోయిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాల గురించి తెలుసుకుని, తాము కూడా కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంత జీవితం గడపాలని నిర్ణయించుకుని వీరంతా లొంగిపోయారని వివరించారు. వారిలో బీజాపూర్ జిల్లా మంగలతొరు గ్రామానికి చెందిన ఎర్రవల్లి ఆర్‌పీసీ మిలీషియా కమాండెర్ మడివి భీమా, ఎర్రవల్లి ఆర్‌పీసీ సీఎన్ఎం అధ్యక్షుడు బోడి ఉంగా, మడివి అడుమ, డీఏకేఎం సభ్యులు కుంజల కోసా, కిష్టారం ఏరియా సీఎన్ఎం కమాండర్ కోవాసి నంద, సీఎన్ఎం సభ్యుడు మడివి భీమా, మడివి మాసా, బీజాపూర్ జిల్లా దొడ్డి తుమ్నార్ గ్రామానికి చెందిన టైలరింగ్ టీం కమాండర్ కుంజా లక్మా, ఆర్‌పీసీ సభ్యురాలు వెట్టి లక్కే, మిలీషియా సభ్యులు మడవి చుక్కయ్య, వెట్టి కోసా, మడవి భీమా, సోడి రాధిక, కుహ్రామి కాజల్ ఉన్నారని వివరించారు. జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో నివసిస్తున్న వలస ఆదివాసీల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై వీరంతా లొంగిపోయారని, ప్రభుత్వం కల్పించే పథకాలతో లబ్ధి పొందాలని, కుటుంబ సభ్యులతో కలిసి జీవనం గడపాలని నిర్ణయించుకున్నారని తెలిపారు. ఈ రెండు నెలల్లోనే 44 మంది మావోయిస్టులు జిల్లా పోలీసుల ఎదుట లొంగిపోయారని చెప్పారు. లొంగిపోయి సాధారణ జీవనం గడపాలనుకునే పార్టీ సభ్యులు వారి కుటుంబ సభ్యుల ద్వారా లేదా స్వయంగా సమీప పోలీస్‌స్టేషన్, లేదా జిల్లా ఉన్నతాధికారులను కానీ సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. లొంగిపోయిన దళ సభ్యులకు జీవనోపాధి, పునరావాసానికి ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతిఫలాలు అందించేందుకు పోలీసులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారని పేర్కొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఐటీడీఏ పీఓ రాహుల్

భద్రాచలం: ప్రభుత్వ సంక్షేమ పథకాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. సోమవారం ఐటీడీఏలో ఏర్పాటు చేసిన గిరిజన దర్బార్‌లో ఆయన అర్జీలు స్వీకరించారు. వాటిని సంబంధిత అధికారులకు అందజేసి అర్హతల మేరకు పరిష్కరించాలని సూచించారు. గిరిజనుల సమస్యలను పరిష్కరించేందుకు యూనిట్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

లక్ష్య సాధనకు కృషి చేయాలి..

దుమ్ముగూడెం : గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు.. లక్ష్యాలు ఏర్పాటుచేసుకుని వాటి సాధనకు కృషి చేయాలని పీఓ రాహుల్ అన్నారు. సోమవారం ఆయన రామచంద్రునిపేట బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు ఇప్పటి నుంచే కెరీర్ గైడెన్స్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. బాలబాలికల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి వారిలో విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. తాను చదువుకునే రోజుల్లో పైలెట్ కావాలని అనుకునేవాడినని, కానీ ఎనిమిదో తరగతి చదివే రోజుల్లో ఓ ఐఏఎస్ అధికారి తమ పాఠశాలకు రాగా, ఆమెను స్ఫూర్తిగా తీసుకొని ఐఏఎస్ కావాలని అనుకున్నానని, ఆ మేరకు లక్ష్యాన్ని సాధించానని వివరించారు. ఆయా కార్యక్రమాల్లో ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్, డీడీ మణెమ్మ, ఎస్‌డీసీ రవీంద్రనాథ్, ఏఓ సున్నం రాంబాబు, ఏసీఎంఓ రమణయ్య, ఏటీడీఓ అశోక్ కుమార్, ఎంఈఓ సమ్మయ్య, తహసీల్దార్ అశోక్ కుమార్, ఎంపీడీవో రామకృష్ణ, హెచ్‌ఎంలు నరసింహారావు, బట్టు రాములు, సోమశేఖర్, నరేందర్, సర్వేశ్వర దొర, వ్యవసాయ శాఖ ఏడీ భాస్కరన్, ఐటీడీఏ ఈఈ చంద్రశేఖర్, ఏపీఓ వేణు, లక్ష్మీనారాయణ, కొండరెడ్ల విభాగం అధికారి మనిధర్, ఎఫ్‌డీసీ ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.



దుమ్ముగూడెం : మాట్లాడుతున్న పీఓ రాహుల్

ఇళ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలి

- ఇందిరమ్మ ఇళ్లలో మేస్త్రీలదే కీలకపాత్ర
- కలెక్టర్ జితేష్ వి పాటిల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, నిర్మాణంలో మేస్త్రీలదే కీలకపాత్ర అని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. స్థానిక ప్రగతి మైదానంలో సోమవారం మేస్త్రీలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ప్రతి ఇంటిని 400 చదరపు అడుగుల లోపు నిర్మించాలని అన్నారు. ప్రభుత్వం మంజూరు చేసే రూ.5 లక్షలతో నాణ్యంగా నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. బేస్‌మెంట్ పూర్తయ్యాక మొదటి విడత రూ. లక్ష, గోడల నిర్మాణం పూర్తయ్యాక రెండో విడత రూ. 1.25 లక్షలు, స్లాబ్ పూర్తయిన తర్వాత మూడో విడత రూ 1.75 లక్షలు, ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత నాలుగో విడత రూ.లక్ష మంజూరు చేస్తామని వివరించారు. శిక్షణలో భాగంగా మేస్త్రీలకు టీ షర్ట్‌లు, హెల్మెట్, బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ శంకర్, మెప్మా పీడీ రాజేష్, న్యాక్ అధికారి హెప్సిబా, ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో వసతులు పెంచాలి..

జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. జిల్లా వైద్య విధాన పరిషత్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పారిశుద్ధ్యం కోసం అధునాతన యంత్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈఎన్‌టీ చికిత్సలకు అవసరమైన యంత్ర పరికరాలకు నివేదికలు అందజేయాలని సూచించారు. ఆస్పత్రుల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు సింగరేణి, ఐటీసీ, కేటీపీఎస్, నవభారత్ వంటి పరిశ్రమలు ముందుకొస్తున్నాయని, ఈ మేరకు తగిన ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. సేవల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన భద్రాచలం ప్రభుత్వ అస్పత్రి సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. సమావేశంలో డీసీహెచ్ఎస్ రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో..

ఆన్‌లైన్ ద్వారా మధ్యాహ్న భోజన చెల్లింపులకు తీసుకుంటున్న చర్యలపై విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా జిల్లాల కలెక్టర్లు, విద్యాశాఖాధికారులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా జిల్లా నుంచి కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం బిల్లుల చెల్లింపులకు యాప్ రూపొందించాలని ఆదేశించారు. వీసీలో డీఈఓ వెంకటేశ్వరాచారి, కొత్తగూడెం ఎంఈఓ ప్రభుదయాల్, ఎఫ్ఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మేస్త్రీల శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

ఈవీఎం గోడౌన్ తనిఖీ

కొత్తగూడెం ఆర్డీఓ కార్యాలయ ప్రాంగణంలోని ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ జితేష్ వి పాటిల్ సోమవారం తనిఖీ చేశారు. ఈవీఎం, వీవీ ప్యాట్లు ఉన్న గదిని, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. గోడౌన్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని, అనుమతి లేనిదే ఎవరినీ లోపలకు అనుమంతించొద్దని ఆదేశించారు. కార్యక్రమంలో ఎన్నికల సూపరింటెండెంట్ దారా ప్రసాద్, కొత్తగూడెం తహసీల్దార్ పుల్లయ్య, ఎన్నికల మాస్టర్ ట్రైనర్ పూసపాటి సాయికృష్ణ పాల్గొన్నారు. అనంతరం యాసంగి సాగుపై సీఎస్ శాంతికుమారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. ఆయన వెంట ఇరిగేషన్ ఎస్ఈ శ్రీనివాసరెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి బాబురావు, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ మహేందర్ ఉన్నారు.

ఎండలు 'మండే'

- మార్చిలోనే భగ్గుమంటున్న సూర్యుడు
- 40 డిగ్రీలకు చేరువైన పగటి ఉష్ణోగ్రతలు
- బొగ్గు గనుల ప్రాంతాల్లో మరింతగా వేడి..

చుంచుపల్లి: మార్చి ఆరంభంలోనే భానుడు భగ్గుమంటున్నాడు. జిల్లాలో రెండు రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. సోమవారం ఏకంగా 39.7 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కొత్తగూడెం, పాల్వంచ, మణుగూరు, భద్రాచలం పట్టణాల్లో నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారులు, కూడళ్లు ఎండల ప్రభావంతో మధ్యాహ్నం కొంతమేర నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. వివిధ అవసరాల కోసం బయటకు వచ్చే వారు తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గత మూడు రోజులుగా ఉదయం పది గంటల నుంచే సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. జిల్లాలో శని, ఆది, సోమవారాల్లో 37 నుంచి 39.7 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు చేరుకున్నాయి. సాధారణ ఉష్ణోగ్రతల కంటే అదనంగా 2 నుంచి 3 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. జిల్లా అంతటా ఎండవేడిమి, ఉక్కపోతతో ప్రజలు ఇప్పటి నుంచే ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా బొగ్గు గనులకు కేంద్రంగా ఉన్న కొత్తగూడెం, మణుగూరు, ఇల్లెందు, ప్రాంతాల్లో మూడు రోజులుగా ఎండ తీవ్రత అధికంగా ఉంటోంది.

40 డిగ్రీలకు చేరువలో..

జిల్లాలో మూడు రోజులుగా పగలంతా ఎండలు పెరుగుతున్నాయి. రాత్రి పూట కాసింత చలి పెడుతున్నా పగటి ఉష్ణోగ్రతలు 38 డిగ్రీలు దాటి నమోదవుతున్నాయి. మార్చి నెలాఖరులో పెరగాల్సిన ఎండలు ఈసారి ముందుగానే ముదరడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. అటు మూడు రోజులుగా కనిష్ట ఉష్ణోగ్రతలు సైతం 20, 21 డిగ్రీల చొప్పున నమోదవుతున్నాయి. దీని ఫలితంగా గాలిలోని తేమశాతంలో తేడాలు వస్తున్నాయని వాతావరణశాఖ నిపుణులు తెలుపుతున్నారు. దీంతో పగలు ఎండ మండిపోతుండగా, రాత్రి నుంచి తెల్లవారే వరకు వాతావరణం కొంత చల్లగా ఉంటుందని చెబుతున్నారు. ఈసారి వేసవి ఆరంభంలోనే అదిరిపోయేలా ఎండలు కాస్తుండటంతో జనం ఆందోళన చెందుతున్నారు. ఇదే విధంగా ఎండలు పెరిగితే మరో రెండు రోజుల్లో 40 డిగ్రీలకు పగటి ఉష్ణోగ్రతలు చేరువయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి. పెరుగుతున్న ఎండల దృష్ట్యా వృద్ధులు, పిల్లల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.



క్లుప్తంగా

యూనిఫామ్ స్టిచ్చింగ్‌పై శిక్షణ



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ విద్యాచందన

చుంచుపల్లి: డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో విద్యార్థులకు యూనిఫామ్ కుట్టే కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లకు సోమవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. కొత్తగూడెంలో జరిగిన ఈ సదస్సులో యూనిఫామ్ క్లాత్ బల్క్ కటింగ్, స్టిచింగ్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి హాజరైన డీఆర్‌డీఓ విద్యాచందన మాట్లాడుతూ రెండు రోజులపాటు మహిళా సంఘాలకు యూనిఫామ్ కుట్టే విధానాలపై శిక్షణ ఇస్తారని తెలిపారు. సెర్ప్ అదనపు డీఆర్‌డీఓ నీలేష్, డీపీఎంలు, ఏపీఎంలు, మహిళా సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

ఇంటర్ యూనివర్సిటీ టోర్నీలో రజతం



పవిత్రను అభినందిస్తున్న ఖమ్మం అదనపు కలెక్టర్, తదితరులు

ఖమ్మం స్పోర్ట్స్: ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ ఉషూ టోర్నీలో ఖమ్మంకు చెందిన పి.పవిత్రాచారి రజత పతకం గెలుచుకుంది. ప్రస్తుతం హైదరాబాద్ జేఎన్‌టీయూలో చదువుతున్న ఆమె చండీఘర్ యూనివర్సిటీలో ఇటీవల జరిగిన ఉషూ పోటీల్లో నాన్‌దావో ఈవెంట్‌లో ఫైనల్స్‌కు చేరింది. ఆతర్వాత హోరాహోరీగా జరిగిన ఫైనల్స్‌లో పవిత్రాచారికి ద్వితీయస్థానం దక్కించుకుంది. తెలంగాణ నుంచి పతకం దక్కించుకున్న క్రీడాకారిణి ఒక్కరే కావడం విశేషం. ఈసందర్భంగా ఆమెను అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, కోచ్ పి.పరిపూర్ణాచారి సోమవారం అభినందించారు.

విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించాలి..



మాట్లాడుతున్న పెసర ప్రభాకర్‌రెడ్డి

కొణిజర్ల: విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి ఉపాధ్యాయులు కృషిచేయాలని జీవశాస్త్ర విభాగం రాష్ట్ర రిసోర్స్ పర్సన్ పెసర ప్రభాకర్‌రెడ్డి సూచించారు. పదో తరగతి విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయడంలో భాగంగా బయాలజీ ఉపాధ్యాయులకు సోమవారం కొణిజర్ల సమీపంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ఓరి యంటేషన్ నిర్వహించారు. జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల బయాలజీ ఉపాధ్యాయులు పాల్గొన్న ఈ సమావేశంలో ఖమ్మం, వైరా సహాయ సంక్షేమ అధికారులు సత్యవతి, జహీరుద్దీన్‌తో కలిసి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి శ్రద్ధ కనబరిస్తే అందరితో పాటే మంచి మార్కులు సాధించే అవకాశముంటుందని తెలిపారు.


25న పోస్టల్ పెన్షన్ అదాలత్

ఖమ్మంగాంధీచౌక్: హైదరాబాద్ రీజియన్ స్థాయిలో ఈనెల 25న పోస్టల్ పెన్షన్ అదాలత్‌ను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహిస్తున్నట్లు ఖమ్మం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ వి.వీరభద్రస్వామి తెలిపారు. పెన్షన్ సంబంధిత అంశాలపై ఫిర్యాదులు ఉన్న వారు 'అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్, పోస్టుమాస్టర్ జనరల్ కార్యాలయం, హైదరాబాద్ రీజియన్, హైదరాబాద్-1, తెలంగాణ సర్కిల్ డాక్ సదన్, 5వ ఫ్లోర్, ఆబిడ్స్, హైదరాబాద్ చిరునామాకు చేరేలా ఈనెల 20వ తేదీ లోగా పంపించాలని తెలిపారు. కవర్‌పై 'పోస్టల్ పెన్షన్ అదాలత్ ఆఫ్ హైదరాబాద్ రీజియన్' అని రాయాలని తెలిపారు. ఆయా ఫిర్యాదులపై ఈనెల 25న ఉదయం 11:30 గంటలకు మొదలయ్యే పెన్షన్ అదాలత్‌తో meet. google.com/ ytf& ptji& wwf లింక్ ద్వారా పాల్గొనవచ్చని వెల్లడించారు.

ఎంపీడీఓ కార్యాలయంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి

కూసుమంచి: మధిర అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి టి.కార్తీక్‌రెడ్డి సోమవారం కూసుమంచి ఎంపీడీఓ కార్యాలయాన్ని సందర్శించారు. శిక్షణలో భాగంగా ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చిన ఆయన 'పంచాయతీరాజ్ శాఖ, సాధారణ పరిపాలన' అంశంపై ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డితో చర్చించారు. కాగా, మంగళ, బుధవారాల్లో ఆయన ఖమ్మం రూరల్ తహసీల్‌తో పాటు ఖమ్మం ఆర్డీఓ, కలెక్టర్ కార్యాలయాలను సందర్శించనున్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,487

జేకే-5ఓసీ మూసివేత?

- ఓపెన్ కాస్టు గనిలో అడుగంటిన బొగ్గు నిల్వలు
- ఈ నెల 31తో ఉత్పత్తి నిలిపివేయనున్న సింగరేణి యాజమాన్యం!
- ఇతర ప్రాంతాలకు బదిలీ చేస్తారని కార్మికుల ఆందోళన



మూతపడే దశకు చేరిన జేకే-5 ఓసీ ముఖద్వారం

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియాలోని జేకే-5 ఓసీ మూసివేసే దశకు చేరింది. ఓపెన్‌కాస్టు గనిలో బొగ్గు నిక్షేపాలు అడుగంటాయి. మార్చి, ఏప్రిల్ లోగా బొగ్గు వెలికితీత పూర్తయ్యే పరిస్థితి కనిపిస్తోంది. దీంతో యాజమాన్యం ఇక్కడి యంత్రాలను ఇతర ప్రాంతాలకు తరలిస్తోంది. దీంతో కార్మికవర్గం ఆందోళన చెందుతోంది. ఇల్లెందు ప్రాంతంలో 1886లో బొగ్గు తవ్వకాలు ప్రారంభమయ్యాయి. ఒకప్పుడు సమారు 10 వేల మంది కార్మికులు పనిచేశారు. క్రమంగా బొగ్గు గనులు మూత పడటం, కొత్త గనులు ప్రారంభించకపోవడంతో కార్మికుల సంఖ్య వందలకు చేరింది. బొగ్గు నిల్వలు లేకపోవడంతో ఫిబ్రవరిలో ఇల్లెందు ఏరియా ఉత్పత్తి 51శాతానికి పడిపోయింది. దీంతో ఈ నెల 31తో జేకే-5 ఓసీలో ఉత్పత్తి పనులు నిలిపివేయాలని యాజమాన్యం భావిస్తోంది. 2023-24 వరకే జేకే ఓసీలో బొగ్గు వెలికితీతకు అనుమతులు ఉన్నా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవతో పూసపల్లి ఓసీ విస్తరణ జరిగే వరకు కొనసాగించాలని ముందుకు సాగారు. అయితే పూసపల్లి ఓసీ అనుమతుల్లో జాప్యం జరుగుతోంది. దీంతో షావల్, నాలగు డంపర్లను ఇప్పటికే ఇతర ప్రాంతాలకు తరలించారు. మరికొన్నింటిని తరలించేందుకు సిద్ధమవుతున్నారు. యంత్రాలతోపాటు ఇతర ఏరియాలకు వెళ్లాలని మొదటి జాబితాలో సుమారు 15 మంది డంపర్ ఆపరేటర్లకు యాజమాన్యం తాఖీదులు ఇచ్చింది. కాగా ఇప్పటివరకు పూసపల్లి ఓసీపై కార్మికులు పెట్టుకున్న ఆశలు అడియాసలుగా మారాయి. ఈ నెల 18న మరోమారు జరగనున్న ఈసీ సమావేశంలోనైనా అనుమతులు లభిస్తాయని కార్మికులు ఎదురుచూస్తున్నారు. ఈ నెల 5న ఏఐటీయూసీ నేతలు సీఎండీని కలవనున్నారు. ఇల్లెందు మనుగడపై చర్చిస్తామని ఇల్లెందు ఏరియా బ్రాంచి కార్యదర్శి నజీర్ అహ్మద్ తెలిపారు.

ఎమ్మెల్యే, ఐఎన్‌టీయూసీ నాయకుల ప్రయత్నం!

ఎమ్మెల్యే కోరం కనకయ్య, ఇక్కడి ప్రాతినిధ్య సంఘమైన ఐఎన్‌టీయూసీ నాయకులు ఓసీ జీవిత కాలం పెంచేందుకు ప్రయత్నిస్తున్నారు. మంగళవారం జీఎం, ఇతర అధికారులతో కలిసి ఎమ్మెల్యే ఓసీని సందర్శించి పరిశీలిస్తామని, అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో చర్చించి జేకే ఓసీని కొంతకాలం పాటు కొనసాగించేలా చర్యలు తీసుకుంటారని ఐఎన్‌టీయూసీ నేత వెంకటేశ్వర్లు తెలిపారు. ఇదే సమస్యపై ఐఎన్‌టీయూసీ నేత జనక ప్రసాద్ కూడా ఒకటి రెండు రోజుల్లో ఇల్లెందులో పర్యటించే అవకాశం ఉందని ఆ సంఘం నాయకుడు గోచికొండ సత్యనారాయణ తెలిపారు. ఓసీ పొడిగింపు వ్యవహారంపై డీజీఎం (పర్సనల్) జీవీ మోహన్‌రావును వివరణ కోరగా.. షావెల్, నాలుగు డంపర్‌లు మాత్రమే తరలించామని తెలిపారు. మార్చి తర్వాత కూడా మరో రెండు నెలలపాటు బొగ్గు వెలికితీస్తామని పేర్కొన్నారు. ఇటీవల డైరెక్టర్ కూడా ఓసీని సందర్శించి పరిశీలించారని, ఉన్నతాధికారులు తగిన నిర్ణయం తీసుకుంటారని వివరించారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా శ్రీపాల్‌రెడ్డి

- రెండో ప్రాధాన్యత ఓట్లతో వరించిన విజయం
- సిట్టింగ్ ఎమ్మెల్సీపై 5,521 ఓట్ల మెజారిటీ



ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి



ఓట్ల లెక్కింపును పర్యవేక్షిస్తున్న నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఖమ్మం - వరంగల్ - నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పీఆర్‌టీయూ-టీఎస్ బలపరిచిన అభ్యర్థి పింగిలి శ్రీపాల్‌రెడ్డి విజయం సాధించారు. సమీప ప్రత్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్సీ నర్సిరెడ్డిపై 5,521 ఓట్ల మెజారిటీతో ఆయన గెలుపొందారు. ఎన్నికల్లో శ్రీపాల్‌రెడ్డికి 13,969 ఓట్లు రాగా, నర్సిరెడ్డికి 8,448 ఓట్లు వచ్చాయి. అయితే నర్సిరెడ్డి ఎలిమినేట్ కాకముందు గెలుపు కోటా ఓట్లు శ్రీపాల్‌రెడ్డికి కూడా లేకపోవడంతో నర్సిరెడ్డిని ఎలిమినేట్ చేసి, ఆయనకు వచ్చిన మొదటి ప్రాధాన్యత ఓట్లలో.. శ్రీపాల్‌రెడ్డికి వచ్చిన 2,870 రెండో ప్రాధాన్యత ఓట్లు కలిపారు. దీంతో శ్రీపాల్‌రెడ్డి 13,969 ఓట్లు సాధించగా గెలుపు ఖరారైంది.

ఉదయం 7గంటల నుంచి కౌంటింగ్..

ఎన్నికల ఓట్ల లెక్కింపు నల్లగొండలోని ఆర్జాల బావిలోని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ గోదాములో సోమవారం నిర్వహించారు. ఉదయం 7గంటలకు ప్రక్రియ మొదలుకాగా, ఉదయం 11 గంటల వరకు బండిల్స్ కట్టాక లెక్కింపు చేపట్టారు. సాయంత్రం 3గంటలకు మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తయింది. మొత్తం 24,135 ఓట్లు పోల్ కాగా 494 ఓట్లు చెల్లలేదు. ఇక 23,641 ఓట్లు చెల్లుబాటు కాగా, ఇందులో సగానికి మించి ఒక్క ఓటు కలిపి 11,821గా గెలుపు కోటా ఓటును నిర్ణయించారు. మొదటి ప్రాధాన్యత ఓట్లలో శ్రీపాల్‌రెడ్డి అత్యధికంగా 6,035 ఓట్లు రావడం, గెలుపు కోటాకు సరిపోకపోవడంతో రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కించారు. చివరకు ద్వితీయ ప్రాధాన్యత ఓట్లతోనే శ్రీపాల్‌రెడ్డి విజయం సాధించారు. కాగా, లెక్కింపులో ఒక్కో రౌండ్ పూర్తవుతుండగా ఉత్కంఠ నెలకొంది. శ్రీపాల్‌రెడ్డి ఆధిక్యంలో ఉన్నా.. ద్వితీయ స్థానంలో ఉన్న నర్సిరెడ్డికి చేరువలో గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి రాగలిగినా సుందర్‌రాజు ఎలిమినేషన్‌తో ఇద్దరి మధ్య భారీ వ్యత్యాసం ఏర్పడింది. ఆ తర్వాత పులి సరోత్తంరెడ్డి, పూల రవీందర్, గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డిని ఎలిమినేట్ చేసి ఓట్లు లెక్కించారు. అప్పటికి కూడా గెలుపు కోటా రాకపోవడంతో నర్సిరెడ్డిని కూడా ఎలిమినేషన్ చేసి ఓట్లు లెక్కించారు. అయినా కోటా రాకపోయినప్పటికీ శ్రీపాల్‌రెడ్డి గెలిచినట్లుగా అధికారులు ప్రకటించారు.

ఎలిమినేషన్‌లో ఓట్లు పెరిగాయి ఇలా..

మొదటి ప్రాధాన్యతలో ప్రధాన అభ్యర్థులైన పింగలి శ్రీపాల్‌రెడ్డికి 6,035 ఓట్లు రాగా, అలుగుబెల్లి నర్సిరెడ్డికి 4,820 ఓట్లు వచ్చాయి. స్వతంత్ర అభ్యర్థి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డికి 4,437 ఓట్లు వచ్చాయి. ఆ తర్వాత పూల రవీందర్‌కు 3,115, బీజేపీ బలపర్చిన అభ్యర్థి సరోత్తంరెడ్డికి 2,289, సుందర్‌రాజుకు 2,040 ఓట్లు మాత్రమే వచ్చాయి. అయితే అతి తక్కువ ఓట్లు వచ్చిన వారిని ఎలిమినేట్ చేస్తూ ఓట్ల లెక్కింపు ప్రారంభించారు. ఇలా 14వ రౌండ్ వరకు ఎలిమినేషన్ చేస్తూ ఓట్ల లెక్కింపు చేయగా శ్రీపాల్‌రెడ్డికి అప్పటి వరకు 6,165 ఓట్లు రాగా, నర్సిరెడ్డికి 4,946 ఓట్లు వచ్చాయి. హర్షవర్ధన్‌రెడ్డికి 4,596 ఓట్లు, పూల రవీందర్‌కు 3,249 ఓట్లు వచ్చాయి. అంటే.. 14వ రౌండ్‌వరకు ఎలిమినేట్ అయిన అభ్యర్థుల నుంచి మరో 130 రెండో ప్రాధాన్యత ఓట్లు శ్రీపాల్‌రెడ్డికి లభించాయి. ఈ రౌండ్ తరువాత సుందర్‌రాజును ఎలిమినేట్ చేసి ఓట్లు లెక్కింపు చేపట్టారు. ఈమేరకు 15వ రౌండ్‌లో శ్రీపాల్‌రెడ్డికి ఒక్కసారే 781 ఓట్లు పెరిగి 6,916కి చేరాయి. రెండోస్థానంలో ఉన్న అలుగుబెల్లి నర్సిరెడ్డి కూడా 5,205 ఓట్లకు చేరుకున్నారు. మిగతా వారికి కూడా ఓట్లు పెరిగినప్పటికీ శ్రీపాల్‌రెడ్డి ఆధిక్యం కొనసాగింది. ఇక 16వ రౌండ్‌లో పులి సరోత్తంరెడ్డి, 17వ రౌండ్‌లో పూల రవీందర్, 18వ రౌండ్‌లో హర్షవర్ధన్‌రెడ్డిని ఎలిమినేట్ చేశారు. అప్పటికి శ్రీపాల్‌రెడ్డి ఓట్లు 11,099కు, నర్సిరెడ్డి ఓట్లు 8,448కు చేరాయి. దీంతో నర్సిరెడ్డిని సైతం ఎలిమినేట్ చేసి ఆయనకు వచ్చిన మొదటి ప్రాధాన్యత ఓట్లలో శ్రీపాల్‌డ్డికి వచ్చిన రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కించారు. ఈమేరకు 2,870 ఓట్లు కలిపి శ్రీపాల్‌రెడ్డి 13,969 ఓట్లు సాధించడంతో గెలుపొందినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రకటించారు.

వైద్యుడు, సిబ్బందిపై ఆగ్రహం

షోకాజ్ నోటీసులు ఇవ్వాలని డీఎంహెచ్‌ఓ ఆదేశాలు



వైద్యుడు, సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కర్ నాయక్

జూలూరుపాడు: సమయపాలన పాటించకుండా, విధులకు ఆలస్యంగా హాజరైన వైద్యుడు, సిబ్బందిపై డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కర్‌నాయక్ ఆగ్రహం వ్యక్తంచేశారు. సోమవారం జూలూరుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఆలస్యంగా వచ్చిన డాక్టర్, వైద్యసిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని మెడికల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లును ఆదేశించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని, ఆస్పత్రి లో ప్రసవాల సంఖ్య పెంచాలని సూచించారు. ఎన్‌సీడీ స్క్రీనింగ్ వేగవంతం చేయాలని చెప్పా రు. రానున్న వేసవి దృష్ట్యా వడదెబ్బకు డీహైడ్రేషన్ బారినపడకుండా ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ బి.వెంకటేశ్వర్లు, డెంటిస్ట్ మౌనిక, సీహెచ్‌ఓ ఎం.రామకృష్ణ, ఎల్‌టీ జగదీష్, స్టాఫ్ నర్సు సునీత పాల్గొన్నారు.

సుజాతనగర్‌లో...

సుజాతనగర్: మండల పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎల్.భాస్కర్ నాయక్ సందర్శించారు. రికార్డులను పరిశీలించి, సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కావాలని ఆదేశించారు. ఎన్‌సీడీ వ్యాధులకు సంబంధించి స్క్రీనింగ్ నిర్వహించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్‌పైకి ట్రాక్టర్.. 'దురంతో'కు తప్పిన ముప్పు


చింతకాని: చెన్నై నుంచి న్యూఢిల్లీ వెళ్తున్న దురంతో ఎక్స్‌ప్రెస్‌కు లోకో పైలట్ అప్రమత్తతతో ముప్పు తప్పింది. రైలు సోమవారం మధ్యాహ్నం విజయవాడ దాటాక ఖమ్మం మార్గంలో వెళ్తుండగా చింతకాని మండలం రామకృష్ణాపురం రైల్వే గేట్ వద్ద ట్రాక్‌పైకి ట్రాక్టర్ వచ్చింది. ఈ మార్గంలో మూడో లైన్ నిర్మాణ పనులు జరుగుతుండగా గేట్ వేయలేదు. దీంతో ట్రాక్టర్ డ్రైవర్ వచ్చినట్లు తెలుస్తుండగా, గమనించిన లోకో పైలట్ బ్రేకులు వేసి వేగాన్ని నియంత్రించాడు. ఈమేరకు గేటు వద్దకు రైలు వచ్చేసరికి ట్రాక్‌పై ఉన్న ట్రాక్టర్ ముందుకు వెళ్లిపోయింది. దీంతో పెనుప్రమాదం తప్పినట్లయింది. కాగా దీనిపై జీఆర్పీ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

13న పండితాపురం సంత వేలం పాట

కామేపల్లి: రాష్ట్రంలోనే పేరున్న కామేపల్లి మండలంలోని కొమ్మినేపల్లి(పండితాపురం) గ్రామపంచాయతీ పరిధి శ్రీకృష్ణప్రసాద్ పశువుల సంత నిర్వహణకు ఈనెల 13న వేలం నిర్వహించనున్నట్లు గ్రామ ప్రత్యేకాధికారి, ఎంపీడీఓ రవీందర్ తెలిపారు. 2025-2026 ఆర్థిక సంవత్సరానికి గాను చేపట్టే ఈ వేలం సంత ఆవరణలో జరుగుతుందని వెల్లడిచారు. జీపీ పరిధిలోని ఎస్టీలు మాత్రమే పాల్గొనేందుకు అర్హులని, ధరావత్ సొమ్ము రూ.30 లక్షలు, సాల్వెన్సీ కింద రూ.5లక్షలు చెల్లించి పాల్గొనాలని ఆయన ఓ ప్రకటనలో కోరారు.

నాలుగు గ్రామాల్లో సౌర విద్యుత్ ప్లాంట్లు

- రెండు జిల్లాల్లో రెండేసి గ్రామాల ఎంపిక
- మహిళా సంఘాల ద్వారా ఒక మెగావాట్ చొప్పున ప్లాంట్లు
- మహిళా దినోత్సవం సందర్భంగా ఈనెల 8న శంకుస్థాపన



ఖమ్మంవ్యవసాయం: ప్రధాన మంత్రి కుసుమ్ పథకం కింద ఉమ్మడి జిల్లాలోని నాలుగు గ్రామాల్లో మహిళా సంఘాల ద్వారా సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా కేంద్రప్రభుత్వం సౌర విద్యుత్ ఉత్పత్తికి ప్రోత్సహిస్తుండగా, వ్యక్తిగతంగా యూనిట్లు ఏర్పాటు చేసుకునే వారికి సబ్సిడీలు అందిస్తోంది. అలాగే, బంజరు, బీడు భూముల్లో ప్లాంట్ల ఏర్పాటుకు అవకాశమిస్తున్నారు. ఇదే సమయాన మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వారి ఆధ్వర్యాన ప్లాంట్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఉమ్మడి జిల్లాలో నాలుగు

పైలట్ ప్రాజెక్టుగా మహిళా సంఘాల ఆధ్వర్యాన ఉమ్మడి జిల్లాలో నాలుగు ప్లాంట్ల ఏర్పాటుకు నిర్ణయించారు. ఈమేరకు ఖమ్మం జిల్లాలోని మధిర మండలం మడుపల్లి, కల్లూరు మండలం చిన్నకోరుకొండి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని సుజాతనగర్ మండలం లక్ష్మీదేవిపల్లి, మణుగూరు మండలం ఉడతనేనిగుంపు గ్రామాలను ఎంపిక చేశారు. ఆయా గ్రామాల్లో ఒక మెగావాట్ విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా ప్లాంట్లు ఏర్పాటుచేశారు. ఇందుకోసం నాలుగెకరాల చొప్పున భూమి, నిర్మాణానికి రూ.3.50 కోట్ల నిధులు అవసరమని గుర్తించారు. ఇప్పటికే స్థలాలు ఖరారైనందున నివేదికలను రెడ్‌కో సంస్థ ద్వారా ప్రభుత్వానికి నివేదించారు.

8న శంకుస్థాపన

రాష్ట్ర వ్యాప్తంగా మహిళా సంఘాల ఆధ్వర్యాన ఏర్పాటుచేసే సౌర విద్యుత్ ప్లాంట్లకు మహిళా దినోత్సవమైన ఈనెల 8న శంకుస్థాపన చేస్తారు. హైదరాబాద్ నుంచి సీఎం రేవంత్‌రెడ్డి వర్చువల్‌గా శంకుస్థాపన చేయనుండగా, గ్రామాల్లో జరిగే కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యే అవకాశముంది.

ఈ వారంలోనే శంకుస్థాపన

మహిళా సంఘాల ద్వారా సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు ఏర్పాట్లు చేశాం. ఉమ్మడి జిల్లాలో ఒక మెగావాట్ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో నాలుగు ప్లాంట్లు తొలిదశలో ఏర్పాటుకానున్నాయి. ఇప్పటికే ప్రభుత్వ స్థలాలను గుర్తించి ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పించాం. ఈ వారంలో శంకుస్థాపన జరిగే అవకాశముంది.

– పోలిశెట్టి అజయ్‌కుమార్, రెడ్‌కో మేనేజర్

పోలీసుల అదుపులో నలుగురు వ్యక్తులు?

జూలూరుపాడు: ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చిన వలస కూలీల్లో నక్సలైట్లు ఉన్నారనే అనుమానంతో నలుగురు వ్యక్తులను సోమవారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మండలంలోని శంభునిగూడెం గ్రామ సమీపంలో ఓ రైతు మిర్చి తోట కోసేందుకు పలువురు వలస కూలీలు వచ్చారు. వారిలో నక్సలైట్లు ఉన్నారనే అనుమానంతో ఇద్దరు మహిళలు, ఇద్దరు పురుషులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. సెల్‌ఫోన్ సిగ్నల్ ట్రేస్ చేసి వారిని పట్టుకున్నట్లు తెలిసింది. సివిల్ డ్రెస్‌లో ఉన్న పోలీసులు అరెస్ట్ చేసి, ప్రత్యేక వాహనాల్లో కొత్తగూడెం తరలించారని స్థానికులు చెబుతున్నారు.

గంజాయి సీజ్

టేకులపల్లి: అక్రమంగా తరలిస్తున్న గంజాయిని టేకులపల్లి పోలీసులు సోమవారం పట్టుకున్నారు. ఎస్‌ఐ సురేష్ కథనం ప్రకారం.. సీలేరు నుంచి హైదరాబాద్‌కు బైక్‌పై 800 గ్రాముల గంజాయిని తరలిస్తుండగా వెంకటీయ తండా స్టేజీ వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఇద్దరు యువకులను అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు.


హత్యకేసులో నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, పక్కన సీఐ, ఎస్‌ఐలు

మణుగూరు టౌన్: ఓబీ కాంట్రాక్ట్ కార్మికుడి హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. డీఎస్పీ కథనం ప్రకారం.. మూడు రోజుల క్రితం మణుగూరులోని ఓసీ-2 పాత డంప్‌యార్డ్ వద్ద ఓ ఓబీ కంపెనీ మెకానిక్ ముని ప్రసాద్ బిశ్వకర్మ హత్య కలకలం సృష్టించింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మధ్యప్రదేశ్‌కు చెందిన మునిప్రసాద్ బిశ్వకర్మ ఓ ఓబీ కంపెనీలో మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. గుజరాత్‌కు చెందిన వినోద్ సిన్హ్ అదే కంపెనీలో హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఇద్దరూ స్నేహంగా ఉండేవారు. గత నెల 27న సాయంత్రం ఓ బెల్ట్ షాపులో మద్యం, బిర్యానీ తీసుకుని క్యాంప్ సమీపంలోని కాల్వ వద్దకు వెళ్లారు. మద్యం తాగుతున్న క్రమంలో ఇద్దరి మధ్య చిన్న విషయంలో ఘర్షణ వచ్చింది. దీంతో వినోద్ సిన్హ్ క్షణికావేశానికి లోనై బిశ్వకర్మ తలపై రాయితో మోదాడు. అక్కడే ఉన్న నవారుతో గొంతు బిగించి హత్య చేశాడు. ఆ తర్వాత ఏమీ తెలియనట్లు విధులకు హాజరయ్యాడు. హత్య సంఘటన గత నెల 28న వెలుగులోకి రాగా పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఇద్దరు కలిసి తిరిగిన ప్రదేశాలు, బెల్ట్‌షాపులు, బిర్యానీ పాయింట్ వద్ద నుంచి విచారించి వివరాలు సేకరించారు. అనంతరం వినోద్ సిన్హ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చగా, న్యాయమూర్తి రిమాండ్ విధించారని డీఎస్పీ తెలిపారు. రెండు రోజుల్లోనే కేసు ఛేదించిన మణుగూరు సీఐ సతీష్, ఎస్‌ఐలు ప్రసాద్, రంజిత్, సిబ్బంది రామారావు, షమీమ్, వీరలను అభినందించి రివార్డులు అందజేశారు.

గుండెపోటుతో జమలాపురం ఆలయ అర్చకుడు మృతి



సుదర్శన్‌శాస్త్రి (ఫైల్)

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయ అర్చకులు ఉప్పల సుదర్శన్‌శాస్త్రి(59) సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. నిత్యపూజల్లో కీలకంగా వ్యవహరించే ఆయన మృతితో స్థానికంగా విషాదం నెలకొంది. ఈమేరకు సుదర్శన్‌శాస్త్రి మృతదేహం వద్ద ఈఓ కె.జగన్మోహన్ రావు, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, ఆలయ చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సీనియర్ అసిస్టెంట్ విజయకుమారి తదితరులు నివాళులర్పించారు.

రోడ్డు ప్రమాదంలో కూలీ...

పెనుబల్లి: మండలంలోని ఎడ్ల బంజర్‌లో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రోజువారీ కూలీ ఇమ్మడి భాస్కర్(55) మృతి చెందాడు. రహదారిపై నడిచి వెళ్తున్న ఆయన రోడ్డు దాటుతుండగా కొత్తగూడెం నుండి వీఎం బంజర వైపు వేగంగా వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన భాస్కర్‌ను స్థానికులు పెనుబల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగానే మార్గమధ్యలో మృతిచెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనాస్థలికి వీఎం బంజర పోలీసులు చేరుకుని విచారణ చేపట్టారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి...

సత్తుపల్లిటౌన్: ప్రమాదవశాత్తు చెట్టు పైనుంచి జారిపడిన వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. సత్తుపల్లి మండలం కాకర్లపల్లికి చెందిన బేతిని సత్యం(55) ఈనెల 1వ తేదీన తన ఇంటి ఆవరణలోని చింత చెట్టు ఎక్కి కాయలు కోస్తుండగా ప్రమాదవశాత్తు జారి పడ్డాడు. దీంతో ఆయన వెన్నుపూస, చేతికి బలమైన గాయాలయ్యాయి. ఈమేరకు స్థానికంగా చికిత్స అనంతరం హైదరాబాద్ తరలించగా పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనపై సత్తుపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

మావోయిస్టు కమాండర్ లొంగుబాటు



బీజాపూర్ పోలీసులు ఎదుట భార్య, కుమారుడితో లొంగిపోయిన దినేష్

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ ఎస్పీ ఎదుట ఓ మావోయిస్టు కమాండర్ సోమవారం భార్య, మూడేళ్ల కుమారుడితో కలిసి లొంగిపోయాడు. మావోయిస్టు పార్టీ గంగులూరు ఏరియా కమిటీ కమాండర్, బీజాపూర్ జిల్లా కమిటీ సభ్యుడు దినేష్ ఎస్పీ జితేందర్‌కుమార్ యాదవ్ ఎదుట లొంగుబాటు ప్రకటించాడు. పోలీసు బలగాలపై దాడులకు వ్యూహరచన చేయడంలో దినేష్‌కు మాస్టర్ మైండ్‌గా పేరుంది. వివిధ ప్రాంతాల్లో సుమారు 100 మంది జవాన్లను మట్టుబెట్టిన ఘటనల్లో ఆయన పాల్గొన్నట్లు పలు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. చిన్న నాటి నుంచే మావోయిస్టు పార్టీ కార్యకలాపాల్లో పాల్గొంటున్న దినేష్ అధునాతన ఆయుధాల వినియోగం, అంబుష్ వేయడం, మందుపాతరలు తయారు చేయడంలో నిష్ణాతుడు కావడంతో తక్కువ కాలంలోనే పార్టీలో పదోన్నతులు పొందాడు. కాగా అతనిపై ఉన్న రూ.8 లక్షల నగదును, అతనికే ఇస్తామని ఎస్పీ తెలిపారు.

భూవివాదంలో ఇరువర్గాల దాడి



చికిత్స పొందుతున్న వెంకటేశ్వరరావు

దమ్మపేట : భూవివాదాలతో సమీప బంధువులైన రెండు వర్గాలు మారణాయుధాలతో పరస్పరం దాడులు చేసుకున్న ఘటన మండల పరిధిలోని చిన్న గొల్లగూడెం శివారులో సోమవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం... మండలంలోని చిన్న గొల్లగూడెం గ్రామానికి చెందిన కవులూరి సంజీవ రావు కుటుంబానికి చెందిన వ్యవసాయ క్షేత్రంలోకి కవులూరి వెంకటేశ్వరరావు మరికొందరితో కలిసి అక్రమంగా ప్రవేశించి ఫెన్సింగ్ రాళ్లు, ఇనుప ముళ్ల తీగను ధ్వంసం చేసేందుకు ప్రయత్నించారు. దీంతో సంజీవరావు తన కుటుంబ సభ్యులతో కలిసి వ్యవసాయ క్షేత్రానికి చేరుకుని ప్రశ్నించాడు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం నెలకొని ఘర్షణకు దారితీసింది. పరస్పరం మారణాయుధాలతో దాడులు చేసుకున్నారు. ఇరువర్గాల వారికి తల, ఛాతీ, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిలో కవులూరు వెంకటేశ్వరరావు, కవులూరి సంజీవరావు, వెంకటమ్మ , ఏసుబాబు ఉన్నారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో దమ్మపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్న వెంకటేశ్వరరావు, సంజీవరావు, వెంకటమ్మలను మెరుగైన వైద్యం కోసం సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

పాల్వంచ: వ్యక్తి ఆత్మహత్య సంఘటనపై సోమవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని పాలకోయతండాకు చెందిన కోట వెంకటేశ్వర్లు(45)కు గతంలో వివాహం జరుగగా భార్యాభర్తల మధ్య మనస్పర్ధలు వచ్చి విడిపోయారు. అనంతరం ఐదేళ్ల క్రితం సైదాబీ అనే మహిళను రెండో వివాహం చేసుకున్నాడు. వీరు హోటల్ వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇటీవల వీరి మధ్య కూడా మనస్పర్ధలు రాగా, సైదాబీ పాల్వంచలోని అక్క కూతురి ఇంటికి వెళ్లిపోయింది. దీంతో మానసికంగా కుంగిపోయి ఆదివారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు సోదరుడు కోట బాలయ్య సోమవారం ఫిర్యాదు చేయగా, ఎస్‌ఐ రాఘవయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.